

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వం లక్ష్యం
- మంత్రి గడ్డం వివేకానంద
- ధాన్యం సేకరణపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌తో కలిసి మంత్రి సమీక్షా సమావేశం
- సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్
- జిల్లాలో రోజుకు 150 లారీల ధాన్యం తరలింపు


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం | 8 మే 2026 | ■ 13 పేజీలు




10

# మండుటెండల్లోనూ నిండా ముంచే..

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- కల్లాల్లో కొట్టుకుపోయిన మొక్కజొన్న
- ఈదురుగాలులకు వందల ఎకరాల్లో రాలిపోయిన మామిడి
- విరిగిపడిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- కరెంటు సరఫరాకు అంతరాయం
- పిడుగులా తగిలిన కరెంట్ షాక్
- వైర్లు తెగిపడి కాలిపోయిన మొక్కజొన్న

అహర్నిశలు కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. గురువారం సాయంత్రం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీనివల్ల పలు మండలాల్లోని కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టిన పంటలు నీటిపాలయ్యాయి. లోకేశ్వరం మండలంలో ప్రకృతి ప్రకోపానికి తోడు విద్యుత్ తీగలు తెగిపడి అగ్నిప్రమాదం సంభవించింది. హవర్గా గ్రామానికి చెందిన కాటిపెల్లి మహేందర్ రెడ్డికి చెందిన ఎకరం మొక్కజొన్న కుప్పలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. బజార్‌హత్నూర్ మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న జొన్న పంట నేలకొరిగింది. మామడ మండలంలో రహదారుల వెంట ఆరబెట్టిన మొక్కజొన్న, నువ్వు, వరి ధాన్యం తడిసిపోయింది. ఈదురు గాలుల ధాటికి టార్పాలిన్ కవర్లు గాలిలోకి ఎగిరిపోవడంతో రైతులు నిస్సహాయ స్థితిలో మిగిలిపోయారు. నేరడిగొండ మండలంలో పీఏసీఎస్ సెంటర్ వద్ద వింత పరిస్థితి నెలకొంది. తూకం వేసిన ధాన్యం బస్తాలు కూడా లారీలు రాకపోవడంతో బయటే ఉండి తడిసిపోయాయి. తడిసిన పంటను లోడ్ చేసుకోమని లారీ డ్రైవర్లు పేచీ పెడుతుండటంతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎటువంటి కోతలు లేకుండా తడిసిన పంటను సేకరించి ఆదుకోవాలని రైతాంగం వేడుకుంటోంది.



3

## సౌర వెలుగుల దిశగా హీరాపూర్ గ్రామం

- మోడల్ సోలార్ గ్రామంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పర్యటన
- హీరాపూర్‌లో ముగిసిన క్షేత్రస్థాయి సర్వే
- త్వరలోనే ఇంటింటికీ సోలార్ విద్యుత్
- వ్యవసాయ బోర్ల కనెక్షన్లకూ సౌర శక్తి
- పనులు వేగం చేయాలని అధికారులకు ఆదేశం
- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని గ్రామాలకు ఆదర్శంగా నిలవనున్న హీరాపూర్
- రెడ్కో, ట్రాన్స్‌కో సమన్వయంతో పని చేయాలి



## ధాన్యం నిల్వపై నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఫోకస్

జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్‌తో కలిసి మామడ, లక్ష్మణచాంద మండలాల్లోని తిరుపెల్లి, మామడ గ్రామాల్లోని రైస్ మిల్లులు, గోదాములను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాముల్లో ఉన్న నిల్వ సామర్థ్యం, ధాన్యం భద్రతపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు.

## ఆధునిక సాగుతోనే సుస్థిర ఆదాయం

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- బోథ్‌లో రైతు వారోత్సవాలు
- డ్రోన్ టెక్నాలజీ, యంత్రీకరణపై రైతులకు కలెక్టర్ అవగాహన
- నిరుద్యోగ యువతకు బంపర్ ఆఫర్
- 40% రాయితీతో డ్రోన్ల కొనుగోలుకు అవకాశం
- భూసారాన్ని కాపాడుకుంటూ పెట్టుబడి తగ్గించుకోవాలని సూచన



2



## సీఎం రేవంత్ రెడ్డి ప్రాణహిత పర్యటన వాయిదా

- ఢిల్లీ పర్యటన, బిజీ షెడ్యూల్ కారణంగా పర్యటన రద్దు
- మహారాష్ట్ర సీఎంతో చర్చల అనంతరం మళ్లీ పర్యటనకు అవకాశం
- ప్రాణహిత ఉమ్మడి ఆదిలాబాద్‌కు లక్ష ఎకరాలకు సాగునీరు
- త్వరలోనే తేదీని ప్రకటిస్తామన్న ఎమ్మెల్సీ దండే విఠల్

సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది. గురువారం సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల ఈ పర్యటన రద్దయినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. కొన్ని రోజులుగా సీఎం ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉండటం, పాలనాపరమైన కార్యక్రమాలతో ఈ టూర్ వాయిదా పడింది.

## నేడు తుమ్మిడిహెట్టికి మంత్రి జూపల్లి

- సీఎం ఆదేశాలతో ప్రాణహిత బరాజ్ క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్న జిల్లా ఇంచార్జీ మంత్రి

# ఆధునిక సాగుతోనే రైతులకు సుస్థిర ఆదాయం

■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ■ బోథ్‌లో రైతు వారోత్సవాలు
■ డ్రోన్ టెక్నాలజీ, యంత్రీకరణపై రైతులకు కలెక్టర్ అవగాహన ■ నిరుద్యోగ యువతకు బంపర్ ఆఫర్
■ 40% రాయితీతో డ్రోన్ల కొనుగోలుకు అవకాశం ■ మట్టి పరీక్షలు తప్పనిసరి
■ భూసారాన్ని కాపాడుకుంటూ పెట్టుబడి తగ్గించుకోవాలని సూచన ■ ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం
■ జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత







**బోథ్, మే 7(ప్రభాత సమాచారం)**

సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి చెప్పి, మారుతున్న కాలానికి అనుగుణంగా వినూత్న వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల సందర్భంగా గురువారం బోథ్ మండల కేంద్రం రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ప్రారంభించి, ప్రభుత్వం రైతులకు విద్యుత్ శాఖ అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను వీడియో ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధునిక సాగుతోనే రైతుకు మేలు జరుగుతుందని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, యంత్రీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యవసాయంలో ఎదురవుతున్న కూలీల కొరతను అధిగమించడానికి యంత్రీకరణే సరైన మార్గమని తెలిపారు. ముఖ్యంగా డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగుమందుల పిచికారీ చేయడం వల్ల పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. నిరుద్యోగ యువత గ్రూపులుగా ఏర్పడి 'పీఎంఈజీపీ' పథకం కింద 35 నుండి 40 శాతం ప్రభుత్వ రాయితీతో డ్రోన్లను కొనుగోలు చేసి ఉపాధి పొందవచ్చని, తద్వారా గ్రామాల్లో రైతులకు తక్కువ ధరకే సేవలు అందుబాటులోకి వస్తాయని సూచించారు. నేల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని, విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని వివరించారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని, సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలని కోరారు. అలాగే, నిషేధిత 'గ్లైఫోసెట్' వంటి మందులను వాడకూడదని హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, పశువుల పేడ, గోమూత్రం వంటి సహజ వనరులతో సాగు చేయడం వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల ప్రాముఖ్యతను వివరిస్తూ, జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవడానికి కేవలం ఒక్క పంటపైనే ఆధారపడకుండా విభిన్న పంటలు పండించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే తీసుకోవాలని, రశీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. జొన్న కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, గిరిజన సహకార సంస్థ, ఎఫ్.పీ.ఓల ద్వారా కొనుగోళ్లు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నానో డిఏపి వాడకం ద్వారా దిగుబడి పొందుతున్న రైతులను ప్రోత్సహించేందుకు ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాతో సన్మానించారు. అంతకుముందు రైతువేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ స్టాల్ లను, పిఎం సూర్యగర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం సోలార్ విద్యుత్ స్టాల్‌ను పరిశీలించి, రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆ తదుపరి రైతు వేదిక సమీపంలోని చేనులో డ్రోన్ ద్వారా పిచికారి చేసే పద్ధతిని స్వయంగా రైతులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, చీఫ్ ఇంజనీర్ చౌహాన్, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, సర్పంచ్ అన్నపూర్ణ, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, శాస్త్రవేత్త ప్రవీణ్, ఏవో శివకుమార్, ఎంపీడీవో రమేష్, ఏంఆర్ఓ సుభాష్ చందర్, రైతులు, వ్యవసాయ, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో ఇళ్లగణనకు పకడ్బందీ ఏర్పాట్లు

**కుమ్రంభీం జిల్లా కలెక్టర్ హరిత**




**ఆసిఫాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఇళ్లగణనకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ హరిత అన్నారు. జనగణన- 2027 కార్యక్రమంలో భాగంగా ఇళ్లగణన కార్యక్రమాన్ని పకడ్బంధీగాఈ చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళి కేరి అన్నారు. హైద టరాబాద్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, మున్సిపాల్ కమిషనర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అన్ని స్థాయిలలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని చెప్పారు. 10వ తేదీలోగా ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు మెటీరియల్ కిట్‌లు, గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు. స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రజలందరికి తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఇళ్లగణన శిక్షణకు బ్యాచ్ హాజరు, సీఎంఎంఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ కె హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 11 నుంచి జూన్ 9వ వరకు నిర్వహించనున్న ఇళ్లగణన ప్రక్రియ కోసం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో 994 మంది ఎన్యూమరేటర్లు, 174 మంది సూపర్‌వైజర్లను నియమించామని వివరించారు. 1,689 ఇళ్ల జాబితా బ్లాక్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇళ్లగణన ప్రక్రియలో విధులు నిర్వహించే వారికి అన్ని స్థాయిలలో శిక్ష పూర్తి చేశామని వివరించారు. స్వీయ గణనను చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నా మని చెప్పారు. ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికాధికారి వాసుదేవరెడ్డి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



## రైతులు దళారులను ఆశ్రయించకుండా

## కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలి

**తాండూర్, మే 7(ప్రభాత సమాచారం)**

రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని తాండూర్ సింగిల్ విండో చైర్మన్ సుబ్బ దత్తుమూర్తి కోరారు. మండలంలోని తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు ప్రైవేట్ వారిని, దళారులను ఆశ్రయించకుండా పీఏసీఎస్ కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలని కోరారు. ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం తూకం, రవాణా సౌకర్యాలు కల్పించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. లారీలు సమయానికి అందుబాటులో ఉంచి ధాన్యం తరలింపులో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు త్వరితగతిన జరగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్దావార్ బొలిశెట్టి పద్మజ, పీఏసీఎస్ సెక్రటరీ అనిల్ కుమార్, పాలకవర్గం సభ్యులు, అధికారులు నాయకులు, పీఏసీఎస్, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

# 'భూభారతి'తో తీరిన గిరిజన రైతు దశాబ్దాల కష్టం

■ పట్టా పుస్తకం అందజేసిన కలెక్టర్ రాజర్షి షా
■ నిషేధిత జాబితా నుంచి 9 ఎకరాల భూమి విముక్తి
■ గొల్లఘాట్ రైతు మడవి గంగారాం నిరీక్షణకు ఫలితం



**ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

ఆదిలాబాదు జిల్లా కలెక్టర్ రాజర్షిషా క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా, భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు మడవి గంగారాం గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సర్వే నంబర్ 74/1/3లో గల 9.00 ఎకరాల సాగు భూమి గతంలో 'నిషేధిత జాబితా' (ఇనాం భూమి)లో ఉండటంతో పట్టా పొందడానికి వీలు లేకుండా పోయింది. రైతు గంగారాం సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి 'భూభారతి' చట్టం ద్వారా సమస్యను పరిష్కరించాలని భీంపూర్ తహసీల్దార్ బానోత్ రమేష్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేసి, నిబంధనల ప్రకారం ఆ భూమిని రైతు పేరిట నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాన్ని అందజేశారు. దశాబ్దాల కల సాకారమవడంతో రైతు గంగారాం ఆనందం వ్యక్తం చేస్తూ, తనకు అండగా నిలిచిన జిల్లా కలెక్టర్ ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి ఆయనకు, రెవెన్యూ యంత్రాంగానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



# సౌర వెలుగుల దిశగా హీరాపూర్

- మోడల్ సోలార్ గ్రామంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పర్యటన
- హీరాపూర్‌లో ముగిసిన క్షేత్రస్థాయి సర్వే త్వరలోనే ఇంటింటికీ సోలార్ విద్యుత్ సరఫరా..
- వ్యవసాయ కనెక్షన్లకూ సౌర శక్తి
- పనులు వేగిరం చేయాలని అధికారులకు ఆదేశం
- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని గ్రామాలకు ఆదర్శంగా నిలవనున్న హీరాపూర్...
- ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా రెడ్కో, విద్యుత్ శాఖ సమన్వయంతో ముందుకు సాగాలి..

**ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామం త్వరలోనే సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా రూపుదిద్దుకోనుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి (ఐఏఎస్) గురువారం గ్రామంలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వనరులు, ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సవాళ్లపై అధికారులతో చర్చించారు.**

**ఇంద్రవెల్లి, మే 7(ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామం త్వరలోనే సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా (మోడల్ సోలార్ విలేజ్) రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి (ఐఏఎస్) గురువారం గ్రామంలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వనరులు, ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సవాళ్లపై ఆయన అధికారులతో చర్చించారు. హీరాపూర్ గ్రామాన్ని ఆదర్శవంతమైన సోలార్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రాథమిక సర్వే ఇప్పటికే పూర్తయిందని సీఎండీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపిక చేసిన గృహాలకు మరియు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసే పనులను వెంటనే ప్రారంభించాలని రెడ్కోఅధికారులను ఆదేశించారు. రైతులకు మరియు సామాన్య ప్రజలకు విద్యు త్ ఖర్చులను తగ్గించడంతో పాటు, పర్యావరణ హితమైన ఇంధనాన్ని అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలులో సాంకేతిక ఇబ్బందులు లేదా క్షేత్రస్థాయి సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ మోడల్ సోలార్ విలేజ్ ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేసి, రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు హీరాపూర్‌ను ఒక దిక్సూచిలా నిలపాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇంటిపై ఏర్పాటు చేసే సోలార్ గ్రిడ్ల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ పర్యటనలో సీఎండీ వెంట ఎన్పీడీసీఎల్ సి.ఇ. జయవంత్ రావు చౌహన్, ఉట్నూర్ డి.ఇ. రామ్ సుబ్బా రెడ్డి, ఏ.డి.ఇ. రోహి దాస్, స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది మరియు రెడ్కో ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు గ్రామంలోని పలు గృహాలను పరిశీలించి, సోలార్ ప్యానెల్స్ అమరికకు వీలుగా ఉన్న ప్రదేశాలను మ్యాపింగ్ చేశారు.

# ధాన్యం నిల్వపై నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఫోకస్



- మామడ, లక్ష్మణచాంద మండలాల్లో గోదాముల తనిఖీ
- క్షేత్రస్థాయిలో రైస్ మిల్లులు, గోదాముల పరిశీలన
- నిల్వ సామర్థ్యంపై అధికారులతో సమీక్ష..
- అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం
- రైతులకు ఇబ్బంది లేకుండా వేగంగా సేకరణ
- పౌర సరఫరాల శాఖకు దిశానిర్దేశం..





**మామడ, మే 7(ప్రభాత సమాచారం)**

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, సేకరించిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మామడ, లక్ష్మణచాంద మండలాల్లో పర్యటించిన కలెక్టర్, ధాన్యం నిల్వకు అందుబాటులో ఉన్న గోదాములు, రైస్ మిల్లులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మామడ మండల కేంద్రంతో పాటు లక్ష్మణచాంద మండలంలోని తిరుపెల్లి గ్రామంలో ఉన్న రైస్ మిల్లుల ఆవరణలను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి గోదాముల నిల్వ సామర్థ్యం, ధాన్యం భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మిల్లుల వద్ద సరిపడా టార్పాలిన్లు, ఇతర అవసరమైన వసతులు సిద్ధంగా ఉంచుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిల్వ సామర్థ్యం విషయంలో ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫ రాల శాఖ అధికారులు రాజేందర్, తహసీల్దార్ సరిత పాల్గొన్నారు.



## జిల్లాలో వేగంగా సాగుతున్న
# డిజిటల్ జనగణన ప్రక్రియ
### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

జిల్లాలో డిజిటల్ జనగణన-2027 ప్రక్రియ పకడ్బందీగా సాగుతోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. గురువారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలికేరి జనగణన - 2027 విధివిధానాలు, సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ విసి హాల్ నుండి ఆయన జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఇప్పటివరకు 89.34 శాతం స్వయం గణన పూర్తయిందని, మొత్తం 8,014 ప్రక్రియలకు గాను 7,160 విజయవంతంగా ముగిశాయని వివరించారు. జనగణన విధుల్లో పాల్గొనే సిబ్బంది శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 44 శిక్షణా బ్యాచ్‌లు వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయని వివరించారు. క్షేత్రస్థాయి నిర్వహణకు కీలకమైన 1,923 హౌస్ లిస్టింగ్ బ్లాక్ డీమార్కేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ పోర్టల్‌లలో వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు అవసరమైన కిట్ల పంపిణీ వేగంగా జరుగుతోందనీ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, డిఆర్ఓ స్రవంతి, పర్యవేక్షకురాలు నలంద ప్రియ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## తెల్లజొన్న కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్

**ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా రైతుల సంక్షేమం, ఆరోగ్యకరమైన ఆహార విధానాల ప్రోత్సాహమే లక్ష్యంగా తెల్ల జొన్న కొనుగోలు ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి సహా మంత్రివర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తెల్ల జొన్న కొనుగోలు నిర్ణయంతో రైతులకు కనీస మద్దతు ధర లభించి ఆర్థికంగా ఊరటనిస్తుందని తెలిపారు. అలాగే ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకమని పేర్కొన్నారు.

# అదిలాబాద్‌లో జాబ్ మేళా సక్సెస్

- 123 మందికి తక్షణ నియామక పత్రాలు.
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడి
- మేళాకు అనూహ్య స్పందన
- 949 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు
- 123 మందికి ఉద్యోగ ఖరారు..
- మరో 308 మంది అభ్యర్థుల షార్ట్ లిస్ట్...
- జిల్లా యువతకు భరోసా: టాస్క్, డీట్ సంస్థల సహకారంతో ఉపాధి మేళా విజయవంతం..
- ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుని వృత్తిపరంగా స్థిరపడాలని కలెక్టర్ పిలుపు



**ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

జిల్లా యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా నిర్వహించిన 'జాబ్ మేళా - 2026' విజయవంతమైందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా క్రీడలు, యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో, టాస్క్, డీట్ సంస్థల సహకారంతో నిన్న (మే 6) నిర్వహించిన భారీ ఉపాధి మేళాను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేళాకు అభ్యర్థుల నుండి అనూహ్య స్పందన లభించిందని, మొత్తం 1,203 మంది నిరుద్యోగ యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని వివరించారు. వీరిలో 949 మంది అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వివిధ రంగాలకు చెందిన 35 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థుల ప్రతిభను పరిశీలించి ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారని వెల్లడించారు. ముఖ్యంగా ఈ మేళా ద్వారా 123 మంది అభ్యర్థులు తమ నైపుణ్యంతో తక్షణ నియామక పత్రాలను అందుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. మరో 308 మంది అభ్యర్థులను తదుపరి దశల కోసం కంపెనీలు షార్ట్ లిస్ట్ చేశాయని, నిరుద్యోగ యువత ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని వృత్తిపరంగా స్థిరపడాలని, ఎంపికైన వారందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు.



# జిల్లాలో విద్యా సంస్కరణలకు శ్రీకారం

## మే 11 నుండి 'విద్యా వారోత్సవాలు
## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా వెల్లడి

**ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

ఈ నెల 11 నుండి 17 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించే 'విద్యా వారోత్సవాలు' సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల నిర్వహణ, ఇతర అంశాలపై గురువారం స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్‌తో ఆయన కలిసి అవగాహన సదస్సు నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో విద్యా వ్యవస్థను బలోపేతమే లక్ష్యంగా, అంగన్‌వాడీ పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో, ప్రాథమిక విద్య పూర్తి చేసిన వారిని ఉన్నత పాఠశాలల్లో 100% చేర్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బడి మానేసిన (డ్రాపౌట్స్) పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు 'విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్'ను పక్కాగా నిర్వహించాలని, పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ ఏరియాలు, పని ప్రదేశాల్లో ప్రత్యేక బృందాలతో సర్వే చేపట్టాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించని 312 మంది విద్యార్థుల కోసం మే 12 నుండి ఉట్నూర్, ఇచ్చోడ, గజిటెడ్ నంబర్ 1 హైస్కూళ్లలో ప్రత్యేక రెమెడియల్ క్యాంపులను ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఉచిత అల్పాహారం, భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే, పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంపులు నిర్వహించి కోడింగ్, యోగా, క్రీడలు వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారని, శాస్త్రీయ దృక్పథం కోసం సైన్స్ పార్క్‌ల సందర్శనతో పాటు ఖాళీ ప్రభుత్వ భవనాల్లో 'స్పేస్ ల్యాబ్‌ల' ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, ఆగష్టు 15 నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 100% గ్యాస్ వినియోగం జరగాలని లక్ష్యంగా నిర్దేశించారు. కట్టెల పొయ్యిల వాడకం వల్ల కలిగే పొగతో విద్యార్థులు, వంట మనుషుల ఆరోగ్యం దెబ్బతినకుండా పెండింగ్‌లో ఉన్న గ్యాస్ కనెక్షన్లను వెంటనే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల పనితీరుపై కఠినంగా వ్యవహరించాలని, గుర్తింపు లేని పాఠశాలలను సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు జరిపినా లేదా అధిక ఫీజులు వసూలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారోత్సవాల ముగింపులో భాగంగా గ్రంథాలయ దినోత్సవం, కళా ఉత్సవాలు, జవహర్ బాల్ భవన్ డే వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలని, ఇంగ్లీష్ మీడియం అమలు, 'యుడైస్' డేటా అప్‌డేషన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం డైట్ కళాశాల వెనుక గల సైన్స్ పార్క్‌ను మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చిన సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ లను విద్యాశాఖ అధికారులు, సైన్స్ ఫోరం సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్లుఐడిసి ఈఈ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, డిఎల్పీఓ ఫణిందర్, మండల విద్యాశాఖ అధికారి సోమయ్య, ఏంఈఓలు, అధికారులు పాల్గొన్నారు.





### పంట నష్టపోయిన రైతులందరికీ
## పరిహారం అందేలా చూస్తా

**బోథ్, మే 7(ప్రభాత సమాచారం)**

నియోజకవర్గంలో అగ్నిప్రమాదాల వల్ల పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అదే విధంగా చూస్తామని ఎమ్మెల్యే జాదవ్ అని పేర్కొన్నారు. గురువారం ఇచ్చోడ మండలంలోని దువర్పేట్ గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు గ్రామానికి చెందిన కట్టె రమేష్ కు చెందిన పంట షాక్ సర్క్యూట్ అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో కాలిపోయిన పంటను పరిశీలించారు. నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో షార్ట్ సర్క్యూట్ తో చేతికి అందే పంటలు కాళీ బూడిదైందని వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు ..ప్రభుత్వం ఆదుకునే విధంగా చూస్తామని పేర్కొన్నారు. తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని గ్రామస్తులు పేర్కొనగా తన బోరుబావి ఏర్పాటు కోసం భూమి పూజ చేయడం జరిగింది. ఆయన వెంట మండలంలోని కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

### జొన్న పంట కొనుగోలు
## కేంద్రం ఏర్పాటు చేయండి

**బోథ్, మే 7(ప్రభాత సమాచారం)**

మండలంలోని మరల పెల్లి గ్రామంలో జొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామానికి చెందిన యువకులు కలెక్టర్ రాజర్షి షాకు విన్నవించారు. గురువారం బోథ్‌కు వచ్చిన సందర్భంగ కలెక్టర్ కలిసి విన్నవించారు. జొన్న పంట సాగు పెద్ద మొత్తంలో ఉన్నందున కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



# బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి



## డీఆర్‌డీఓ దత్తరావు

**వాంకిడి, మే 7(ప్రభాత సమాచారం)**

బాలికల రక్షణ, విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కుమ్రం భీం జిల్లా డీఆర్‌డీఓ దత్తరావు పిలుపునిచ్చారు. వాంకిడి మండలం ఖమానలో గురువారం కిషోర బాలికల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మే 2 నుంచి 10 వరకు సమ్మర్ క్యాలెండర్ కార్యక్రమాల ద్వారా గ్రామీణ బాలికల్లో చైతన్యం తెస్తున్నామని ఆయన తెలిపారు. బాల్య వివాహాల నివారణపై ప్రతి కుటుంబం బాధ్యత వహించాలన్నారు. బాలికల ఆరోగ్యం, ఉన్నత విద్య, ఆర్థిక అవగాహన, వ్యక్తిత్వ వికాసం, సైబర్ భద్రతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలికలను చదివించి స్వయం సమర్థులుగా తీర్చిదిద్దితేనే సమాజాభివృద్ధి సాధ్యమని చెప్పారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలు, అధికారులు సమన్వయంతో బాలికల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎంలు రామకృష్ణ, యాదగిరి, ఏపీఎం ధనరాజ్, శారద, రాణి, వీఓ అధ్యక్షురాలు రేణుక, సీసీలు భీంరావు, రమేష్, వీవోఎస్ లు ఆనంద్‌రావు, బాబురావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

## మాజీ ఎంపీ సోయం బాపురావ్



**బోథ్, మే 7(ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని వారి అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాల పేద ప్రజలకు అండగా ఉంటున్నారని మాజీ ఎంపీ సోయం బాపూరావు పేర్కొన్నారు కోట కె. గ్రామంలో నూతనంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుడు బాలాజీ ఆహ్వానం మేరకు వచ్చి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం గ్రామంలో 15 మంది పేదలకు ఇండ్లు మంజూరు ఇవ్వడం జరిగింది అన్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో త్రాగునీటి ఇబ్బంది ఉందని గ్రామస్తులు మాజీ ఎంపీ కి విన్నవించారు.తాను గతంలో నాలుగు, బోర్ బావులు మంజూరు ఇవ్వడం జరిగిందని అయితే కాలనీవాసుల కోరిక మేరకు మరో బోర్వెల్ ఇస్తామన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదలకు సరైన న్యాయం



**బోథ్, మే 7(ప్రభాత సమాచారం)**

మండలంలోని దన్నూరు గ్రామంలో గురువారం ఆత్మ చైర్మన్ రాజు యాదవ్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను కలిసి కింద నిర్మాణంపై అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని ఇది ప్రజా ప్రభుత్వం అన్నారు.ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్న కళా నెరవేరుస్తామన్నారు సైతం త్వరలో మంజురవుతాయన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇన్ ద లబ్ధిదారులు నాయకులను సన్మానించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో మరల పెల్లి ఉపసర్పంచ్ రమేష్ బోత్ ఉప సర్పంచ్ విజయ సన్నీ లాడే వార్ అనిల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు దన్నూరు గ్రామ సర్పంచ్ నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



### ఉన్నతాధికాలతో మాట్లాడి
## రైతులకు న్యాయం చేస్తా

**బోథ్, మే 7(ప్రభాత సమాచారం)**

మండలంలోని కనుగుట్ట గ్రామంలో పంటలు కాలిపోయి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడం కోసం తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ జీ నగేష్ పేర్కొన్నారు. గురువారం గ్రామంలో కాలిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని తాను రైతుల ఆర్థిక స్థితిగతులను జిల్లా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు వివరించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. చేతికి అందిన పంట కళ్ళముందే కాలిపోతే రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు అన్నారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేంత వరకు తాను కృషి చేస్తానన్నారు. అక్కడి నుండే ఉన్నతాధికారులకు మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేగాక అగ్నిమాపణ కేంద్రాన్ని మండలానికి కేటాయించడంతో ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంటమండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్ దక్షిణ మధ్య రైల్వే మాజీ బోర్డు సభ్యులు జీవీ రమణ సహకార సంఘం అధ్యక్షులు ప్రశాంత్ ఉన్నారు.



## బాలికలు విద్యపై దృష్టి సారించాలి

**వాంకిడి, మే 7(ప్రభాత సమాచారం)**

బాలికలు విద్యపై దృష్టి సారించాలని డీఆర్‌డీవో దత్తారాం అన్నారు. వాంకిడి మండలం కమాన గ్రానమంలో గురువారం కిశోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజానికి అనర్థాలను కలిగిస్తాయన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకోవడం వల్ల వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్ దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో బాలికలు చదువుపై ఎక్కువ దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సైబర్ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచితుల మాటలను నమ్మవద్దన్నారు. బాలికల రక్షణ, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న బేటి బచావో బేటి పడావో కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు రామకృష్ణ, ధనరాజ్, యాదగిరి, మహిళా సాధికారత అధికారులు శారద, రాణి, రేణుక, సీసీలు భీంరావు, రమేష్, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపు

**రెబ్బెన, మే 7(ప్రభాత సమాచారం)**

కుట్టు మిషన్ శిక్షణ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె హరిత అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో గురువారం మహిళా సాధికారత సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుట్టు మిషన్ శిక్షణ ద్వారా మహిళలకు జీవనోపాధి పొందవచ్చన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు వస్త్ర ధారణపై ఎక్కువ చూపుతున్నారన్నారు. తదనగుణంగా ఎంబ్రాయి డరీ డిమాండు ఉన్నందున మహిళలు కుట్టు మిషన్ శిక్షణ తీసుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసే అవకాశం ఉంటుందన్నారు. మహిళలకు శిక్షణ అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. శిక్షణ పొందిన మహిళలు నలుగురికి ఉపాధి కల్పించే లా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కాప్డే అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కుసుమ విజయ, మహిళలు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా సమతా సుదర్శన్

**ముథోల్, మే 7(ప్రభాత సమాచారం)**



దేశంలో కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఎస్సీ కాంగ్రెస్ సెల్ లుమరింత ప్రతిష్ట పరిచేందుకు ఉమ్మడి జిల్లా పరిశీలకులుగా గొల్ల మల్ల చెందిన సమతా సుదర్శన్లు పార్టీ నియమించింది. ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎస్సి విభాగాన్ని మరింత ప్రతిష్టపరిచేందుకు ఉమ్మడి జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : మందమర్రి సీఐ పర్స రమేష్

**మందమర్రి, మే 7(ప్రభాత సమాచారం)**



సైబర్ మోసాలపై, సోషల్ మీడియా విషయంలో అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సీ ఐ పర్స రమేష్ అన్నారు. గురువారం ఉదయం కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తవారిపేట గ్రామంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా సిఐ మాట్లాడుతూ సైబర్ మోసాలు, ట్రాఫిక్ భద్రత, డ్రగ్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలియని లింకులను ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని తెలిపారు. ఫేక్ కాల్స్, ఫిషింగ్ సందేశాలు, సోషల్ మీడియా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 సేవలను వినియోగించాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. స్వీయరక్షణ, నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో అలాగే ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను తగ్గించడంతో పాటు భద్రతను పెంచవచ్చని వివరించారు. కార్డన్ సెర్చ్ లో 38 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దు

**నిర్మల్, మే 7(ప్రభాత సమాచారం)**



పంట కొనుగోలు జాప్యం చేయవద్దని రైతులు కలెక్టర్ కార్యాలయంలో గురువారం జెసి కిషోర్ కుమార్ కు వినతి పత్రం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న వరి నిలువలు పెరిగిపోతున్నాయని వర్షాల వల్ల తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు జెసి దిష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ రూరల్ మండలం రైతులు సాయి రెడ్డి రైతులు ఉన్నారు.

## పోడు భూముల్లో అటవీ శాఖ కందకాలు



- అధికారులను అడ్డుకున్న కర్జెల్లి రైతులు!
- ఎక్స్‌కావేటర్లతో తవ్వకాలు నిలిపివేయాలని డిమాండ్
- తమ సాగు భూములను కాపాడాలని రైతుల గోడు
- రైతుల పక్షాన నిలిచిన బీజేపీ నేత సుధాకర్‌రావు
- అధికారులతో చర్చలు.
- నిబంధనల మేరకే స్వాధీన ప్రక్రియ అన్న ఎఫ్ఆర్ఓ

**చింతలమానేపల్లి, మే 7(ప్రభాత సమాచారం)**

అటవీ అధికారులు పోడు భూముల స్వాధీన ప్రక్రియలో భాగంగా భూముల్లో కందకాల తవ్వకాలు వెంటనే నిలిపివేసి, తమకు న్యాయం చేయాలని కర్జెల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. పోడు భూముల స్వాధీనంలో భాగంగా కర్జెల్లి రేంజ్ పరిధిలోని కర్జెల్లి గ్రామ శివారు ప్రాంతం నుంచి ఎక్స్‌కావేటర్ సహాయంతో గురువారం అటవీ అధికారులు కందకాలు చేపడుతుండగా రైతులు అడ్డుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు రైతుల పక్షాన అధికారులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఎఫ్ఆర్వో సుభాష్ మాట్లాడుతూ రైతులతో ముందుగానే అటవీ భూములకు సంబంధించి సమావేశం ఏర్పాటు చేశామని వివరించారు. నిబంధనల మేరకు భూమలు స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. కర్జెల్లి రేంజ్ కార్యాలయానికి రైతులు వెళ్లి అధికారులతో తమ గోడును చెప్పుకున్నారు. కానీ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం కొంత భాగాన్ని తీసుకొని మిగిలిన భాగాన్ని రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. దీంతో రైతుల్లో నిరుత్సాహం నెలకొంది. వేరేవాళ్లు సాగు చేసే భూముల్లోకి తాము ఎలా వెళుతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రైతులకు ఎలాంటి ఇబ్డందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## రవీంద్రభారతి వేదికపై నిర్మల్ కవి ప్రతిభ



- రాష్ట్రస్థాయిలో నిర్మల్ కవికి అరుదైన గౌరవం
- రవీంద్రభారతిలో మునిమడుగుల రాజారావుకు సత్కారం

**నిర్మల్, మే 7 (ప్రభాత సమాచారం):**

నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ కవి, రచయిత మునిమడుగుల రాజారావుకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న "99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శన"లో భాగంగా బుధవారం (మే 6న) నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన తన కవితా ప్రతిభను చాటుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక కవి సమ్మేళనంలో కవితా గానం చేయడానికి నిర్మల్ నుంచి ఎంపికైన రాజారావుకు, సభలో మొదటి కవిగా అవకాశం రావడం విశేషం. ఆయన వినిపించిన కవితా ప్రవాహం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ యువజన అభ్యుదయ, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ (ఐఏఎస్), భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. మునిమడుగుల రాజారావు ప్రస్తుతం నిర్మల్ ఎల్ఐసీ శాఖలో పరిపాలన అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేస్తున్నారు. ఆయన ఇప్పటివరకు కవిత్వంతో పాటు పలు తాత్విక వ్యాసాల పుస్తకాలను వెలువరించారు. గతంలో కూడా ఎన్నో రాష్ట్రస్థాయి పురస్కారాలను అందుకున్న రాజారావు, 'పా సొసైటీ'ని స్థాపించి సాహిత్య, తాత్విక చర్చల ద్వారా ఎందరో యువ కవులకు మార్గదర్శిగా నిలుస్తున్నారు. రవీంద్రభారతి వేదికపై ఆయనకు దక్కిన ఈ గౌరవం పట్ల నిర్మల్ జిల్లా సాహిత్య కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఉర్దూ మీడియం విద్యార్థినికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సన్మానం

**ఖానాపూర్, మే 7(ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం నుంచి ఇటీవల టెన్త్ ఫలితాల్లో ఉర్దూ మీడియం జిల్లా టాపర్గా మార్కులు సాధించిన సయ్యద్ మదీహ ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ సన్మానించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెను ఎమ్మెల్యే సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉర్దూ మీడియం లో 555 మార్కులు సాధించి కాపర్ గా నిలిచిన ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు .విద్యార్థినిని శాలువాతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి సయ్యద్ అయూబ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజు రా సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రటరీ షబ్బీర్ ష ,కౌన్సిలర్ గొర్రె గంగాధర్, నాయకులు అవమానుల్లా ఖాన్, జన్నారపు శంకర్,చరణ్,శేషాద్రి ఉన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన కమిషనర్ రమేశ్

**బెల్లంపల్లి, మే 7(ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేష్ గురువారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమిషనర్ రమేష్ గడ్డం వినోద్ నుకలసి పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గడ్డం వినోద్ మాట్లాడుతూ, బెల్లంపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కమిషనర్ కు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పట్టణంలో మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ సుందరీకరణకు ప్రత్యేక కృషి చేయాలనిన్నారు. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని కమిషనర్ తెలిపారు.





### జిల్లాలో వేగంగా సాగుతున్న
# డిజిటల్ జనగణన ప్రక్రియ

■ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, మే 7(ప్రభాత సమాచారం)

జిల్లాలో డిజిటల్ జనగణన-2027 ప్రక్రియ పకడ్బందీగా సాగుతోందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడించారు. గురువారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలికేరి జనగణన - 2027 విధివిధానాలు, సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ విసి హాల్ నుండి ఆయన జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఇప్పటివరకు 93.844 శాతం స్వయం గణన పూర్తయిందని,ఇప్పటి వరకు 12897 విజయవంతంగా ముగిశాయని వివరించారు. జనగణన విధుల్లో పాల్గొనే సిబ్బంది శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 44 శిక్షణా బ్యాచ్‌లు వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయని వివరించారు. క్షేత్రస్థాయి నిర్వహణకు కీలకమైన 1551 హౌస్ లిస్టింగ్ బ్లాక్ డీమార్కేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ పోర్టల్‌లో వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు అవసరమైన కిట్ల పంపిణీ వేగంగా జరుగుతోందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సిపిఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

■ భూసారాన్ని కాపాడుకుంటూ పెట్టుబడి తగ్గించుకోవాలని సూచన

■ ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

వాంకిడి, మే 7(ప్రభాత సమాచారం)

వాంకిడి మండలం సామెల గ్రామంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రొఫెసర్ అనురాధ, సౌజన్య పాల్గొని రైతులకు పంటల సాగులో మెలకులవల పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. పంట సాగులో యూరియా వాడకం, పెట్టుబడులు తగ్గించడం, మట్టి పరీక్షలు, నేల ఆరోగ్యాన్ని కాపాడు కోవడం వంటి విషయాలపై వివరించారు. ఈ సందర్భం గా వాంకిడి మండల వ్యవ సాయ అధికారి గోపికాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మండల రైతులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అరవింద్, గ్రామ సర్పంచ్ సంతోష్‌తో, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఈదురు గాలులకు తెగిపడ్డ వైర్లు
# తగలబడిన మొక్కజొన్న కుప్పలు

■ హవర్గా గ్రామంలో విషాదం

■ కళ్ళముందే బూడిదైన రైతు మహేందర్ రెడ్డి ఆశలు.

■ మంటలార్పడానికి రైతుల సాహసం

■ బోరు బావుల ద్వారా నీటిని పంపి ప్రెట్టి పోరాటం

■ రూ. 50 వేలకు పైగా నష్టం

ముథోల్ (లోకేశ్వరం), మే 7(ప్రభాత సమాచారం)

లోకేశ్వరం మండలంలో గురువారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదం ఒక నిరుపేద రైతును కోలుకోలేని దెబ్బ తీసింది. ప్రకృతి వైపరీత్యం మరియు విద్యుత్ శాఖ నిర్లక్ష్యం తోడై, నూర్పిడికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట అగ్ని కీలలకు ఆహుతైంది. హవర్గా గ్రామానికి చెందిన రైతు కాటిపెల్లి మహేందర్ రెడ్డి తన పొలంలో ఒక ఎకరంలో మొక్కజొన్న సాగు చేశారు. పంట కోత పూర్తి చేసి, గింజలు తీయడానికి (నూర్పిడి కోసం) పొలంలోనే కుప్పలుగా పోసి సిద్ధంగా ఉంచారు. అయితే, గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ ఈదురు గాలులు వీచాయి. గాలి వేగానికి పొలం పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని, తెగి నేరుగా మొక్కజొన్న కుప్పలపై పడ్డాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా క్షణాల్లో మంటలు చెలరేగి పంటంతా వ్యాపించాయి. పంట కాలిపోతుండటం గమనించిన బాధితుడు, సమీప పొలాల్లోని రైతులు ప్రాణాలకు తెగించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక యంత్రం సమాచారం అందించినప్పటికీ, అది వచ్చేలోపే మంటలు భారీగా ఎగసిపడ్డాయి. రైతులు సమయస్ఫూర్తితో వ్యవహరించి,



పక్కనే ఉన్న బోరు బావుల నుండి పైపుల ద్వారా నీటిని పంపి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. వారి సాహసం వల్ల మంటలు పక్కనున్న ఇతర పొలాలకు వ్యాపించకుండా ఆగిపోయాయి, లేదంటే నష్టం ఇంకా భారీగా ఉండేది. ఈ ప్రమాదంలో దాదాపు ఒక ఎకరం పంట పూర్తిగా బూడిదైపోయింది. దీని విలువ మార్కెట్ ధర ప్రకారం సుమారు 50 వేల రూపాయల వరకు ఉంటుందని అంచనా. "రేపో మాపో పంట అమ్మి అప్పులు కడదామనుకున్నా.. కానీ ఇప్పుడు చేతికి వచ్చిన పంట బూడిదై మిగిలింది" అని బాధితుడు మహేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులపై అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



### టీవీ చూడొద్దని మందలించినందుకు
## డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

■ చదువుకోవాలని చెప్పినందుకు మనస్థాపం

■ గడ్డిమందు తాగి తనువు చాలించిన అక్షయ

■ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

■ రోటిగూడ గ్రామంలో విషాద ఛాయలు

■ క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం..

■ నిండు నూరేళ్ల జీవితం బలి..

జన్నారం, మే 7(ప్రభాత సమాచారం)

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామంలో అత్యంత విషాదకర ఘటన వెలుగుచూసింది. కేవలం టీవీ చూడొద్దని, చదువుపై దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు మందలించినందుకే ఒక యువతి క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడింది. డిగ్రీ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జన్నారం ఎస్సై జి. ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రోటిగూడ గ్రామానికి చెందిన మోత్కూరి అక్షయ (19) డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అక్షయ ఇంటి వద్ద ఉన్న సమయంలో తరచూ టీవీ చూస్తుండేది. దీంతో ఆమె తల్లిదండ్రులు, చదువుకోవాల్సిన వయసులో ఇలా టీవీకి అతుక్కుపోవడం సరికాదని, పరీక్షలు దగ్గరపడుతున్నందున చదువుపై దృష్టి సారించాలని సున్నితంగా మందలించారు. తల్లిదండ్రులు అన్న మాటలకు తీవ్ర మనస్థాపానికి గురైన అక్షయ, గురువారం ఉదయం ఎవరూ లేని సమయంలో గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఇంట్లో ఉన్న గడ్డిమందును తాగి ఆత్మహత్యకు యత్నించింది. గదిలో నుంచి శబ్దాలు రావడంతో గమనించిన తల్లి వెంటనే తలుపులు తీసి చూడగా, అక్షయ అపస్మారక స్థితిలో పడి ఉంది. పరిస్థితిని అర్థం చేసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెను కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ, ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున అక్షయ మృతి చెందినట్లు ఎస్సై ధృవీకరించారు. మృతురాలి తండ్రి లక్ష్మీనారాయణ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జన్నారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు చిన్న కారణానికే ప్రాణాలు తీసుకోవడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# కల్యాణ లక్ష్మి పేదల హక్కు : పైసా ఖర్చు లేకుండా లబ్ధిదారులకు అందాలి

■ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ■ ఆదిలాబాద్ అర్బన్, మావల మండలాల లబ్ధిదారులకు

■ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ.

ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో లభించే లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రజల ప్రాథమిక హక్కు అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్ మరియు మావల మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, వైస్ చైర్మన్ మొహమ్మద్ రోహిత్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న వెంటనే క్షేత్రస్థాయిలో విచారణను వేగవంతం చేసి, సంబంధిత నిధులు త్వరితగతిన వారి ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలన్నారు. ఎక్కడా జాప్యం జరగకూడదని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకూడదని ఆయన హెచ్చరించారు. ఈ పథకాలను పొందేందుకు లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని పాయల్ శంకర్ స్పష్టం చేశారు. "మధ్య దళారులను నమ్మి మోసపోవద్దు. కళ్యాణ లక్ష్మి చెక్కులు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే నా దృష్టికి తీసుకురండి, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన భరోసా ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తనను కలవవచ్చని రైతులకు, పేదలకు సూచించారు. ఆడపిల్లల వివాహం ముగిసిన వెంటనే



తల్లిదండ్రులు ఆలస్యం చేయకుండా మీ-సేవ కేంద్రాల ద్వారా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తద్వారా నిధుల మంజూరు ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తూ, వారి కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.



# నకిలీ సర్టిఫికెట్ల ముఠా గుట్టురట్టు

- ఐదుగురు అరెస్ట్.. 280 డిజిటల్ పత్రాలు స్వాధీనం
- ఫోన్లలోనే పీడీఎఫ్ ఎడిటింగ్ యాప్స్ ద్వారా నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్, ఓటర్ కార్డుల సృష్టి
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ. రూ.3,000 వసూలు
- నిందితుల నెట్వర్క్ చూసి పోలీసులు షాక్..
- మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- మావల పీఎస్ పరిధిలో దాడులు..
- ప్రభుత్వ పత్రాల కోసం మీ-సేవ, అధికారిక కార్యాలయాలనే ఆశ్రయించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి..

**ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

నకిలీ పత్రాలను సృష్టిస్తూ ప్రజలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఒక భారీ ముఠాను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డుపెట్టుకుని ఆధార్, ఓటర్ ఐడీ, బర్త్ సర్టిఫికెట్లను ఫోన్లలోనే తయారు చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను మావల పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ రోడ్డు, యూనియన్ బ్యాంక్ పరిసరాల్లో కొందరు వ్యక్తులు అధికారిక ముద్రలతో ఉన్న నకిలీ జనన ధృవీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎ. జగదీశ్వర్ గౌడ్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. కమిషనర్‌కు సమర్పించిన కొన్ని పత్రాలను రికార్డులతో సరిపోల్చగా, అవి మున్సిపల్ డేటాబేస్‌లో లేవని తేలడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ఎస్పీ ఆదేశాల మేరకు మావల ఇన్‌స్పెక్టర్ కె. స్వామి నేతృత్వంలోని ప్రత్యేక బృందం నిందితులను పట్టుకుంది. నిందితులు ఓసా రవికుమార్, షేక్ అమీర్, అబ్దుల్ ముజాహిద్, అబ్దుల్ తన్వీర్, అడపా సంతోష్‌లను అరెస్ట్ చేయగా, జునైద్ అనే మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. వీరు స్మార్ట్ ఫోన్లలో పీడీఎఫ్ ఎడిటింగ్ యాప్స్‌ను ఉపయోగించి అసలైన సర్టిఫికెట్లను పోలినట్లుగా నకిలీవి తయారు చేసేవారని విచారణలో తేలింది. ఒక్కో పత్రానికి అవసరాన్ని బట్టి రూ. 1,500 నుండి రూ. 3,000 వరకు వసూలు చేసేవారు. నిందితుల వద్ద నుండి సుమారు 280కి పైగా నకిలీ డిజిటల్ పత్రాలు, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో పని అయిపోతుందని లేదా అడ్డదారిలో పత్రాలు వస్తాయని దళారులను ఆశ్రయించి చిక్కుల్లో పడవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజలను కోరారు. ప్రభుత్వ పరమైన ఏ ధృవీకరణ పత్రమైనా కేవలం మీ-సేవ కేంద్రాలు లేదా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల ద్వారా మాత్రమే పొందాలని, నకిలీ పత్రాలు కలిగి ఉండటం కూడా నేరమని ఆయన హెచ్చరించారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రాహుల్ కాంత్, సీఐ స్వామి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలం ముందస్తు సన్నద్ధతపై రాష్ట్ర స్థాయి సమీక్ష



- జిల్లాలో త్వరలో ఫ్లడ్ మాక్ డ్రిల్
- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా వెల్లడి
- కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ వీడియో కాన్ఫరెన్స్

**నిర్మల్, మే 7(ప్రభాత సమాచారం)**

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల నివారణ, విపత్తు నిర్వహణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వర్షాకాలానికి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలు, వరదల సమయంలో తక్షణ స్పందన, ప్రజల రక్షణ, సహాయక చర్యలు, అత్యవసర సేవల సమన్వయంపై విస్తృతంగా సమీక్షించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, చెరువులు, వాగులు, కాలువలు, రహదారుల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా నిర్మల్ జిల్లాలో జిల్లా స్థాయి ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా వరదల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను ప్రాయోగికంగా అమలు చేసి శాఖల మధ్య సమన్వయాన్ని పరీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్ పరిపాలన, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖలతో పాటు ఇతర అత్యవసర సేవల విభాగాలు పాల్గొంటాయని తెలిపారు. ప్రజల తరలింపు ప్రక్రియ, సహాయక శిబిరాల ఏర్పాటు, రక్షణ చర్యలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానాలను సమగ్రంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు. విపత్తుల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.



## సౌర విద్యుత్తును వినియోగించి పంటలను సాగు చేసుకోండి

**సోనాల, మే 7(ప్రభాత సమాచారం)**

అటవీ హక్కు పత్రాలు పొందిన గిరిజనులు సౌర విద్యుత్తును వినియోగించుకొని పంటలను సాగు చేసుకోవచ్చని విద్యుత్ శాఖ ఏడిఈ లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం. సోనాల మండల కేంద్రంలో రైతు వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి జి దేవా నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ యాంత్రిక రణ డ్రోన్ వినియోగం పై అవగాహన కలిగించారు, పీఎం కోసం ,పథకంలో సోలార్ విద్యుత్తు వినియోగంపై రైతులకు వివరించారు .కార్యక్రమంలో సోనాల తాసిల్దార్ ఏ మల్లేష్ స్థానిక సర్పంచ్ యాల బిందుజ ఉపసర్పంచ్ తుల శ్రీకాంత్ వార్డు సభ్యులు తుల హరీష్ సబ్ ఇంజనీర్ శ్రీ ఎండిల్ ఇన్స్పెక్టర్ పి లక్ష్మణ్ విద్యుత్ శాఖ సిబ్బందితోపాటు రైతులు పాల్గొన్నారు.

## సబ్ ట్రెజరీ కార్యాలయం తరలించవద్దు

**బోథ్, మే 7(ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని బోథ్ నుండి తరలించవద్దని గ్రామ సర్పంచ్ కురుమే అన్నపూర్ణ జిల్లా కలెక్టర్ ను కోరారు. సొంత భవనం లేనందున ఇక్కడి నుండి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె కలెక్టర్ విన్నవించారు. కార్యాలయం తరలకుండా ఇక్కడే ఉండే విధంగా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాసిల్దార్ సుభాష్ చంద్ర ఎంపీడీవో రమేష్ ఎంపీ ఓ రాజ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి అంజయ్య ఆత్మ చైర్మన్ జి రాజు యాదవ్ ఉపసర్పంచ్ విజయలక్ష్మి వార్డు సభ్యులు కట్ట భూమేష్ షేక్ షాకీర్ వినయ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.





## ఉట్నూర్‌లో దంచికొట్టిన వాన

**ఉట్నూర్, మే 7(ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో గురువారం సాయంకాలం అకాల వర్షం కురిసింది. అకాల వర్షం కురవడంతో రబ్బి పంటలలో జొన్న పంట సాగు చేసిన రైతులు పంటలు తీసుకునే సమయంలో అకాల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందారు. అకాల వర్షం భారీగా కురిస్తే చేతికొచ్చిన జొన్న పంట తడిసిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్‌లో వర్షం కురిసింది.

## అకాల వర్షంతో తడిసిన ధాన్యం

**ముథోల్ (లోకేశ్వరం), మే 7(ప్రభాత సమాచారం)**

లోకేశ్వరం మండలంలోని కనకాపూర్, అబ్దుల్లాపూర్, వాస్తాపూర్, జోహార్‌పూర్, వాటోలి తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి ఉంచిన వరి ధాన్యం తడిసిపోయింది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ధాన్యం పై కప్పిన టార్పాలిన్ కవర్లు భారీ ఈదురు గాలులకు లేచిపోయాయి. ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురవడంతో ధాన్యాన్ని కాపాడుకునే పరిస్థితి లేకుండా పోయింది.

# కలమడుగులో 'రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

- రసాయన ఎరువులు తగ్గించి.. భూసారాన్ని పెంచాలి
- వానాకాలం సాగుపై రైతులకు శాస్త్రవేత్తల దిశానిర్దేశం
- కలమడుగులో వ్యవసాయ సదస్సు..
- యూరియా వాడకం తగ్గించాలి
- పచ్చిరొట్టె ఎరువులతోనే నేల ఆరోగ్యంగా ఉంటుంది.
- సాయిల్ హెల్త్ కార్డ్ ప్రాముఖ్యతపై అవగాహన
- భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం.

**జన్నారం, మే 7(ప్రభాత సమాచారం)**

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు" కార్యక్రమం జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో ఉత్సాహంగా జరిగింది. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, అధికారులు నేరుగా రైతుల వద్దకే వచ్చి సాగులో మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ.. రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులను వాడటం వల్ల భూసారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నత్రజని (యూరియా) ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. "సాయిల్ హెల్త్ కార్డ్" (భూసార పరీక్ష పత్రం) ప్రతి రైతు వద్ద ఉండాలని, నేలలో ఏ లోపాలు ఉన్నాయో తెలుసుకుని దానికి తగినట్లుగా మాత్రమే ఎరువులు వాడాలని స్పష్టం చేశారు. రాబోయే వర్షాకాలం (ఖరీఫ్) సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. భూమిని సాగుకు సిద్ధం చేసే సమయంలో పచ్చిరొట్టె ఎరువులను వేయడం వల్ల నేలకు సహజసిద్ధమైన పోషకాలు అందుతాయని తెలిపారు. వాతావరణ మార్పులను తట్టుకుని, అధిక దిగుబడిని ఇచ్చే వరి వంగడాలను ఎంచుకోవాలని సూచించారు. ఒకే రకమైన పంట వేయకుండా, పంట మార్పిడి చేయడం ద్వారా తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చని వివరించారు. చౌడు నేలల్లో సాగు చేసే రైతులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో క్షుణ్ణంగా వివరించారు. ఈ సదస్సులో శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారిణి (ఇంచార్జ్) దివ్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. రైతులు శాస్త్రవేత్తల సలహాలను పాటించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని, లాభదాయకమైన వ్యవసాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలమడుగు గ్రామ సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వార్షాకాలం సీజన్ ప్రారంభానికి ముందే శాస్త్రవేత్తలు తమ గ్రామానికి వచ్చి అవగాహన కల్పించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.





## నేను కాకుండా వేరే ఎవరైనా బాగుండేది..

ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్‌కు జోడీగా సాయి పల్లవి నటించిన తాజా చిత్రం 'ఏక్ దిన్' . ఈ చిత్రంతో బాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన ఆమెకు అనుకున్న స్థాయిలో ఆదరణ దక్కలేదు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా మిశ్రమ ఫలితానికే పరిమితమైంది. తాజాగా ఈ సినిమాను అంగీకరించడంపై సాయి పల్లవి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ఏక్ దిన్' చేయడానికి ప్రధాన కారణం స్క్రిప్ట్. చిత్రబృందం నన్ను సంప్రదించిన సమయంలో నేను చాలా ఎమోషనల్ సినిమాల్లో నటిస్తున్నాను. అందుకే మనసుకు హాయిగా అనిపించే పాత్రలు చేయాలనుకున్నా. షూటింగ్ సమయంలోనూ ఆ తర్వాత కూడా ఎలాంటి మానసిక ఒత్తిడి లేని తేలికపాటి కథ చేయాలని అనుకున్నాను. ఈ స్క్రిప్ట్ విన్నప్పుడు నాకు హాలీవుడ్ క్లాసిక్ 'బిఫోర్ సన్‌రైజ్' గుర్తుకు వచ్చింది. ఆ సినిమా అంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఈ ప్రాజెక్ట్‌కి వెంటనే ఓకే చెప్పాను". "ప్రీమియర్ షో చూసిన తర్వాత ఈ పాత్రకు నేను సరిపోలేదని నాకు అనిపించింది. ఇదే మాట ఆమిర్ ఖాన్‌తో చెప్పా. 'ఈ పాత్రకు నన్ను కాకుండా మరొకరిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదేమో. చురుగ్గా, హుషారుగా ఉండే కొత్త అమ్మాయిని ఎంపిక చేసి ఉండాల్సింది. వాళ్లు ఈ పాత్రకు బాగా న్యాయం చేసేవాళ్లు' అని నా మనసులో మాటను ఆమిర్‌తో చెప్పా" అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో పాల్గొన్న జునైద్.. ఈ పాత్రకు సాయి పల్లవి సరైన ఎంపిక అని చెప్పారు. 'ఏక్ దిన్' సినిమా థాయ్ చిత్రం 'వన్ డే'కు రీమేక్‌గా రూపొందింది. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.



## నితిన్ కొత్త చిత్రం ప్రారంభం

కొంత విరామం తర్వాత కథానాయకుడు నితిన్ కొత్త సినిమాకి శ్రీకారం చుట్టారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాణంలో... నారి సిరిసవాడ, సోమశేఖర్.టి దర్శకత్వం వహిస్తున్న ఆ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇందులో నితిన్ సరసన రితికా నాయక్ నటిస్తున్నారు. ప్రతిభ కలిగిన నటీనటులు, సాంకేతిక బృందం కలిసి చేస్తున్న ఈ సినిమాపై అందరిలోనూ ప్రత్యేకమైన ఆసక్తి నెలకొందని, ఈ నెల రెండో వారం నుంచే చిత్రీకరణని ప్రారంభిస్తామని సినీ వర్గాలు చెప్పాయి.

## 'శంబాల' దర్శకుడితో సందీప్ కిషన్ కొత్త అడ్వెంచర్..

టాలీవుడ్ యువ నటుడు సందీప్ కిషన్, 'శంబాల' మేకర్స్‌తో చేతులు కలిపారు. 'శంబాల' చిత్ర దర్శకుడు యుగంధర్ మునితో ఆయన తన 33వ సినిమాను చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తాజాగా ఈ మూవీ బృందం ఓ పోస్టర్‌ను విడుదల చేస్తూ ప్రాజెక్ట్‌ను ప్రకటించింది. ప్రస్తుతం ఈ సినిమాను SK 33 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారు. విడుదలైన పోస్టర్‌లో టైటిల్‌తో పాటు ఒక కత్తి కనిపించగా, చిన్న ఒడ్డుపై బుట్టలో పడుకున్న పాపను ఒక సింహం చూస్తున్న దృశ్యం ఆకట్టుకుంటోంది. ఈ విజువల్స్‌ను బట్టి చూస్తే ఇది పూర్తి స్థాయి అడ్వెంచర్ నేపథ్యంలో సాగే సినిమా అని స్పష్టమవుతోంది. 'శంబాల' తర్వాత కూడా యుగంధర్ ముని మరో విభిన్న కథతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రాన్ని 'శంబాల'ను నిర్మించిన షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం వరుస పరాజయాలతో ఇబ్బందుల్లో ఉన్న సందీప్ కిషన్‌కు ఈ సినిమా మంచి విజయాన్ని అందిస్తుందేమో చూడాలి.






## మెగా కోడలి షాకింగ్ డెసిషన్..

'ప్రస్తుతం నేను సినిమాల్ని ఒప్పుకోవడం లేదు. ఫ్యామిలీకే టైం కేటాయిస్తున్నా. నా బాబుతోనే సమయం గడచిపోతున్నది.. అందుకే సినిమాలకు కాస్త విరామం తీసుకుంటాను' అని చెప్పింది కథానాయిక లావణ్య త్రిపాఠి. ఆమె ప్రధాన పాత్రలో నటించిన వినోదాత్మక చిత్రం 'సతీ లీలావతి' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకురానుంది. తాతినేని సత్య దర్శకుడు.ఈ సందర్భంగా బుధవారం లావణ్య త్రిపాఠి విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమా షూటింగ్ టైంలోనే తాను ప్రెగ్నెట్ అయ్యానని, టీమ్ అందరి సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా షూటింగ్ పూర్తిచేశానని చెప్పింది. 'ఈ సినిమాలో నేను డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఈ కథలో వినోదంతో పాటు చక్కటి సందేశం ఉంటుంది. హృదయానికి హత్తుకునే ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉంటాయి' అని లావణ్య త్రిపాఠి తెలిపింది. రామ్‌చరణ్ ఎప్పుడూ సపోర్టివ్‌గా ఉంటారని, ఈ సినిమా ట్రైలర్‌ను ఆయన రిలీజ్ చేయడం సంతోషంగా అనిపించిందని ఆమె తెలిపింది.వరుణ్‌తేజ్ రూపంలో తనకు అర్థం చేసుకునే భర్త దొరికాడని, ప్రస్తుతం తాము బాబుతో కలిసి హ్యాపీగా ఉన్నామని లావణ్య త్రిపాఠి చెప్పింది. 'వరుణ్‌తేజ్‌తో కలిసి నటించాలనుంది. మేం రియల్‌లైఫ్‌లో కలిసే ఉన్నాం. కాబట్టి తెరపై మా జంట కొత్తగా కనిపించాలంటే కథ విభిన్నంగా ఉండాలి. అలాంటి వైవిధ్యమైన కథ దొరికితే భవిష్యత్తులో తప్పకుండా కలిసి నటిస్తాం' అని లావణ్య త్రిపాఠి పేర్కొన్నది.




- అకాలవాన అన్నదాతను ఏడిపిస్తోంది
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గాలివాన బీభత్సం
- అకాల వర్షం.. అన్నదాత ఆగమాగం
- రెండు,మూడు రోజులుగా ఈదురుగాలులు,వర్ష బీభత్సం
- వేలాది ఎకరాల్లో వరి, మామిడి పంటలకు నష్టం
- కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో తడిసిన ధాన్యం
- నిర్మల్‌లో కొట్టుకుపోయిన టార్పాలిన్లు..
- మార్కెట్ యార్డుల్లో వర్షం నీటిలోకొట్టుకుపోయిన వడ్లు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో
- కన్నీరు మున్నీరవుతున్న రైతులు



(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)
ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షానికి రైతులు భారీగా పంటలు నష్టపోయారు. మార్కెట్ యార్డులకు తెచ్చిన మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులోకి వరద నీరు చేరడంతో పంట ఉత్పత్తులు తడిశాయి. సొంత డబ్బులతో ప్లాస్టిక్ కవర్లు కొనుగోలు చేసి పంటలపై కప్పిన ఫలితం లేకుండా పోయింది. పంటను కాంటా చేసి సంచుల్లో నింపిన కొనుగోళ్ల పట్టీలు ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. బేల సబ్ మారెట్ యార్డులో జొన్న పంట తడిసింది. నేరడిగొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మక్కలు కొనుగోలు చేస్తున్న సమయంలో వర్షం జోరుగా కురిసింది. కుప్పలపై టార్పాలిన్స్ కప్పడానికి వర్షంలోనే తడుస్తూ రైతులు పంట ఉత్పత్తులు కాపాడుకున్నారు. జైనథ్ మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న జొన్నలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. గన్నీ బ్యాగులు లేని కారణంగా వారం రోజుల నుంచి జొన్నలు కొనలేదు. పంట కండ్ల ముందు తడిసి ముద్దవుతుంటే రైతులు కంటతడి పెడుతున్నారు. ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులోని మొక్కజొన్నను తాడిపత్రులతో కప్పి రక్షణ తీసుకున్నారు. కోతకొచ్చిన జొన్న పంటలతోపాటు గోధుమ పంటలు వర్షంతో కొంత మేర తడిసి నష్టం వాటిల్లింది. బోథ్ మండలంలో కోత దశలో ఉన్న జొన్న, నువ్వు పంటలు నేలకొరిగాయి. ధన్నూర్(బీ) ప్రాంతంలో కురిసిన వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జొన్నలు అమ్మకానికి తెచ్చి బస్టాండ్ సమీపంలో కుప్పలుగా పోసి నిల్వ ఉంచారు. గాలి దుమారానికి టార్పాలిన్ లేచిపోవడంతో కప్పడానికి అవస్థలు పడ్డారు. మరోవైపు గాలి మూలంగా చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. మామిడి కాయలు రాలిపోయాయి.

**నిర్మల్ జిల్లాలో...**

నిర్మల్ జిల్లాలో గురువారం కురిసిన వర్షం అన్నదాతకు మరింత నష్టాన్ని తెచ్చిపెడుతోంది. ఇప్పటికి యాసంగిలో సాగుచేసిన మొక్కజొన్న, జొన్న. పొద్దుతిరుగుడు, వరి పంటలు కోతలు కోసి పంటను కొనుగోలు కేంద్రంలో నిలువ చేయగా గురువారం కురిసిన వర్షానికి తడిసిపోయింది. జిల్లాలను తాండూర్ కుబీర్ భైంసా లోకేశ్వరం ముధోల్ బాసర్ కుంటాల నర్సాపూర్ సారంగాపూర్ నిర్మల్ రూలర్ సోన్ మండలాల్లో గంటసేపు బలమైన కూడిన వర్షం కురిసినట్టు రైతులు తెలిపారు. పంటపై వర్షం నీరు పడకుండా రైతులు టార్ఫిన్ లు కప్పినప్పటికీ బలమైన కాల్పుల వల్ల అవి లేచిపోయినట్టు రైతులు తెలిపారు. పంటలు కాపాడుకునేందుకు రైతులు పంట కలాల్లో నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం కొనుగోళ్లలో జాప్యం చేయడం వలన చేతికొచ్చిన పంట తడిసిపోతుందని రైతులు ఆవేదన చెందారు. తాండూర్ మండల కేంద్రంలో రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు అధికారులు వచ్చి పంట కొనుగోలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన నిర్మించారు. వర్షం వల్ల పంట తడిసిపోతే రంగు మారి నాణ్యత పేరుతో ప్రభుత్వం కొనుగోలు నిలిపివేసే అవకాశం ఉన్నందున రైతులకు వెంటనే న్యాయం చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు. ఆయా మార్కెట్లో





ఉన్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు దాన్ని ఆరబెడుతున్నారు.

**ముథోల్ నియోజకవర్గంలో ప్రకృతి ప్రకోపం**

**ముథోల్, మే 7(ప్రభాత సమాచారం)**
ముథోల్ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షం సామాన్య ప్రజలకు వేడి నుంచి ఉపశమనం కలిగించినప్పటికీ, రైతాంగానికి మాత్రం తీరని శోకాన్ని మిగిల్చింది. నియోజకవర్గంలోని పలు మండలాల్లో అపార పంట నష్టం వాటిల్లింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆశగా ఎదురుచూస్తున్న ధాన్యం కుప్పలపై వర్షపు నీరు ప్రవహించడంతో పంట పూర్తిగా తడిసి ముద్దయింది. సకాలంలో అధికారులు కొనుగోళ్లు చేపట్టి, గోదాములకు తరలించకపోవడం వల్లే తమకు ఈ దుస్థితి పట్టిందని రైతులు మండిపడుతున్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న రాశులు నీటి పాలవ్వడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలు గాలి వేగానికి కుప్పకూలిపోయాయి. పొలాల్లో నీరు చేరడంతో కోత యంత్రాలు (హార్వెస్టర్లు) వెళ్లే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తోటల పెంపకం చేపట్టే రైతులకు కూడా భారీ నష్టం వాటిల్లింది. ఈదురు గాలుల ధాటికి మామిడి కాయలు, చింతకాయలు భారీగా నేలరాలడంతో పెట్టిన పెట్టుబడి కూడా దక్కేలా లేదని వాపోతున్నారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే తాము నష్టపోతున్నామని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న తమను ఈ వర్షం మరింత కుంగదీసిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని నియోజకవర్గ రైతాంగం డిమాండ్ చేస్తోంది. ఈ అకస్మాత్తు వర్షం వల్ల నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వడమే కాకుండా, పలుచోట్ల విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగింది.

**లోకేశ్వరం మండలంలో తడిసిన ధాన్యం...**

లోకేశ్వరం మండలంలోని కనకాపూర్, అబ్దుల్లాపూర్, వాస్తాపూర్, జోహార్‌పూర్, వాటోలి తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి ఉంచిన వరి ధాన్యం తడిసిపోయింది. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. ధాన్యం పై కప్పిన టార్పాలిన్ కవర్లు భారీ ఈదురు గాలులకు లేచిపోయాయి. ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురవడంతో ధాన్యాన్ని కాపాడుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రైతులు కళ్ల ముందే ధాన్యం తడిసిపోతుండగా ఏమీ చేయలేని పరిస్థితిలో నిలిచిపోయారు. ప్రభుత్వం ఇకనైనా కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**మక్కరైతుల ధర్నా...**

నిర్మల్ జిల్లా భైంసా మండలం మాటేగాం టోల్‌ప్లాజా వద్ద 61వ జాతీయ రహదారిపై గురువారం మొక్కజొన్న కొనుగోలు చేయాలని రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడం, తూకం వేసి న వడ్లు తరలించకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శశిభూషణ్ ధర్నా వద్దకు వచ్చి త్వరలో మక్క కొనుగోళ్లు చేపట్టేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అలాగే తానూర్, బెల్‌తరోడ మొక్కజొన్న కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, ట్రాన్స్‌పోర్టు లారీల సమస్యల వల్ల కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో గురువారం కురిసిన వర్షానికి





తడవడంతో ఆగ్రహించిన రైతులు భైంసా రహదారిపై ధర్నాకు దిగారు. తహసీల్దార్ మహేందర్‌నాథ్ ఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తహసీల్దార్ మార్క్‌ఫెడ్ డీఎంతో మాట్లాడి గన్నీ బ్యాగులు, లారీలు వచ్చేలా చూడాలని, కొనుగోలు చేయాలని చెప్పడంతో రైతులు శాంతించారు.















## కాంగ్రెస్ పార్టీ మండల
# అధ్యక్షుల నియామకం

**బెల్లంపల్లి,మే 7(ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాలకు నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డితో సంప్రదించి, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలోనీ మండల/పట్టణ అధ్యక్షుల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలు తక్షణమే అమలు చెయ్యాలని ఆ ఉత్తర్వులలో ఆదేశించారు. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బండి ప్రభాకర్, మండల అధ్యక్షుడిగా దుర్గం రాజయ్య, తాండూర్ మండల అధ్యక్షుడిగా పెద్దబోయిన శంకర్, భీమిని మండల అధ్యక్షుడిగా మదారి కొమురయ్య, కన్నెపల్లి మండల అధ్యక్షుడిగా ఏల్పుల మల్లేష్, వేమనపల్లి మండల అధ్యక్షుడిగా గాలి మధు, కాసిపేట మండల అధ్యక్షుడిగా పనాల మహేష్‌లను నియమించారు. కష్టపడి కృషి చేస్తూ, క్షేత్రస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి సర్వశక్తులను ఒడ్డి, కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసారని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నట్టు ఆ ప్రకటనలో టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.






# గోళీ సోడా రీ బ్రాండింగ్



భారత రుచికి ప్రపంచం దాసోహం

## అంతర్జాతీయంగా పెరుగుతున్న ఎగుమతులు

- నాణ్యతతో ప్రజాదరణ
- గల్ఫ్, అమెరికా, యూకెల్లో విక్రయాలు అధికం

(ప్రభాత సమాచారం, వెబ్ డెస్క్)

భారత్ లో ఒకప్పుడు అత్యంత ప్రాచుర్యం పొందిన గోళీ సోడా (గోలి పాప్) ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ దక్కించుకుంటుంది. భారత్ లోనే గాకుండా, విదేశాల్లోనూ ప్రజాదరణ పొందుతున్న గోళీ సోడా ఎగుమతులను పెంచేందుకు అపెడా (ఏపీఈడీఏ- అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ అథారిటీ) వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నది. స్వదేశీ పానీయాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రోత్సహిస్తూ ఎగుమతులు పెరిగేలా చేస్తున్నది. ఇప్పటికే భారత గోళీ సోడాకు అమెరికా, యూకె, యూరప్, గల్ఫ్ మార్కెట్లలో జనాదరణ దక్కించుకొని ఎగుమతుల్లో పెరుగుదల నమోదవుతున్నది. అయితే అప్పటి గోళీ సోడానే నేడు గోలి పాప్ సోడాగా పేరు మార్చిన అపెడా ఎగుమతులను పెంచగలిగింది. అంతేగాక ప్యాకింగ్, లేబులింగ్, ఆరోగ్యకరమైన పానీయంగా రూపుదిద్దడంలో విజయవంతమైంది. దాంతో భారత గోళీ సోడాకు విదేశాల్లోనూ ఆదరణ పెరుగుతున్నది. గల్ఫ్ లో అతిపెద్ద రిటైల్ చైన్ లో ఒకటైన లులూ హైపర్ మార్కెట్ పెద్ద ఎత్తున గోళీ సోడాలను దిగుమతి చేసుకుంటుంది.






### భారత వారసత్వ పానీయం..

ప్రపంచ వేదికపై భారత్ గొప్ప పానీయాల వారసత్వాన్ని ప్రదర్శిస్తూ సత్తా చాటుతున్నది. అధిక నాణ్యత గల గోళీ సోడా ఉత్పత్తులను అందజేస్తూ విదేశీయుల నోటికి అసలైన రుచుల మేళవింపును ప్రదర్శిస్తుంది. దాంతో క్రమేణా అంతర్జాతీయ మార్కెట్ లో కూడా గోళీ సోడా (గోలి పాప్ సోడా)కు ఆదరణ పెరుగుతూ ఎగుమతుల్లో వృద్ధి నమోదవుతున్నది. ఎన్నో రకాల బహుళ జాతీయ సంస్థల శీతల పానీయాల రాకతో దాదాపు కనుమరుగైపోయిందనుకున్న భారతీయ గోళీ సోడా అంతకంటే రెట్టింపు వేగంతో మార్కెట్ లోకి అడుగుపెట్టి ఆరోగ్యానికి ఆరోగ్యం, నాణ్యత, రుచి మేళవింపులతో కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నది. దాంతో వీటిని సేవించిన వారు మళ్ళీ మళ్ళీ గోళీ సోడానే డిమాండ్ చేస్తుండడంతో వీటి ఎగుమతులు పెరిగాయి.

### గోలి పాప్ సోడాకు గుర్తింపు..

వీటి ప్యాకేజింగ్ , రుచి, నాణ్యత, రీ బ్రాండింగ్ వంటి విషయాల్లో అపెడా ఎన్నో జాగ్రత్తలు కూడా తీసుకున్నది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లను ఆకర్షించగలిగింది. ఇటీవలే ఇంటర్నేషనల్ ఫుడ్ అండ్ డ్రింక్ ఈవెంట్ లండన్ లో గోళీ సోడా (గోలి పాప్ సోడా) ప్రదర్శనలో మేటిగా నిలిచింది. దాంతో ఎగుమతులు మరింత పెరిగాయి. భారత దేశ వైవిధ్యమైన వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఒక విలువైన వేదికగా ఐఎఫ్ ఈ నిలిచింది. భవిష్యత్ లో గోళీ సోడా ఓ పెద్ద పరిశ్రమగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మొత్తానికి భారతదేశ శీతల పానీయం గోళీ సోడా ఎండలోనూ కూల్ కూల్ చేస్తుంది.

# బిద్రెల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా అంబేకర్ సాయిరాం బాధ్యతల స్వీకారం



- రైతుల సంక్షేమమే లక్ష్యమని వెల్లడి
- ముథోల్‌లో అట్టహాసంగా పదవీ బాధ్యతల స్వీకరణ
- తీగల వెంకటేష్ గౌడ్ రాజీనామాతో వైస్ చైర్మన్ నుండి చైర్మన్‌గా పదోన్నతి..
- సహకార సంఘం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు చేరవేస్తామని భరోసా
- నూతన చైర్మన్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించిన పాలకవర్గ సభ్యులు, సిబ్బంది..

**ముథోల్, మే 7(ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా ముథోల్ మండలం బిద్రెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా అంబేకర్ సాయిరాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. మాజీ చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్ ఇటీవల బాసర సర్పంచ్‌గా విజయం సాధించడంతో, నిబంధనల మేరకు చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైస్ చైర్మన్‌గా ఉన్న సాయిరాంకు పాలకవర్గం చైర్మన్ బాధ్యతలు అప్పగించింది.
నిర్మల్ జిల్లా ముథోల్ మండల పరిధిలోని బిద్రెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన సారథిగా అంబేకర్ సాయిరాం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. బిద్రెల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా గతంలో పనిచేసిన తీగల వెంకటేష్ గౌడ్, ఇటీవల జరిగిన బాసర గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా విజయం సాధించారు. నిబంధనల ప్రకారం ఒకే వ్యక్తి రెండు పదవుల్లో ఉండకూడదు కాబట్టి, ఆయన తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో అప్పటి వరకు వైస్ చైర్మన్‌గా ఉన్న అంబేకర్ సాయిరాంకు చైర్మన్ బాధ్యతలను అప్పగించారు. పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం అంబేకర్ సాయిరాం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పాలకవర్గ సభ్యులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం కోసం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో ఉన్న సామాన్య రైతులకు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహకార సంఘం ద్వారా రైతులకు అందించే రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకత పాటిస్తామని చెప్పారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చని, సొసైటీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సాయిరాంను పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది మరియు స్థానిక నాయకులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో బిద్రెల్లి సొసైటీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సొసైటీ సీఈఓ, వివిధ గ్రామాల రైతులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# నేడు తుమ్మిడిహెట్టికి మంత్రి జూపల్లి



- ప్రాణహిత బరాజ్ నిర్మాణంపై పెరుగుతున్న ఉత్కంఠ
- నియోజకవర్గ ఆశలు నెరవేరేనా?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్న జిల్లా ఇంచార్జీ మంత్రి..
- ప్రాణహిత ప్రాజెక్టుపై కొనసాగుతున్న సందిగ్ధతకు తెరపడాలని రైతాంగం డిమాండ్...
- భూ నిర్వాసితులకు కొత్త మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని బాధితుల విన్నపం..
- జిల్లాలో పర్యాటక రంగం, మూలనపడ్డ ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణపై పర్యటనలో ప్రధాన చర్చ

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రాణహిత ప్రాజెక్టు కల నెరవేరే దిశగా కీలక అడుగు పడనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆదేశాల మేరకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి మరియు ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద పర్యటించనున్నారు. ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మించాలనే ప్రభుత్వ యోచన నేపథ్యంలో, ఈ పర్యటన జిల్లా రాజకీయాల్లో మరియు రైతుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. గతంలో ప్రాణహిత ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులు ఇంకా పరిహారం కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. పాత ధరల ప్రకారం ఇచ్చిన పరిహారం ఏమాత్రం సరిపోదని, ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం చెల్లింపులు చేయాలని లేదా భూమికి బదులు భూమిని కేటాయించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పర్యటనలో తమ గోడును వినిపించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రాణహిత, వార్ధా, వై గంగ వంటి జీవ నదులు నియోజకవర్గం గుండా ప్రవహిస్తున్నా, జిల్లా రైతాంగం సాగునీటి కోసం ఆకాశం వైపు చూడాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిర్వహణ లేక, విద్యుత్ మోటార్లు చోరీకి గురై మూలనపడ్డాయి. ఈ పర్యటనలోనైనా మంత్రి ఈ ఎత్తిపోతల పథకాలకు మోక్షం కలిగించి, ఆయకట్టుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు. అలాగే పూడికతో నిండిపోయిన కాలువల మరమ్మతులపై కూడా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం, జీవనదుల తీరం, పులుల సంచారానికి నిలయమైన కాగజ్‌నగర్ డివిజన్‌ను పర్యాటక కేంద్రంగా మార్చే అవకాశం ఉన్నా గత పాలకులు విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యాటక శాఖ మంత్రి కూడా అయిన జూపల్లి, ప్రాణహిత పరీవాహక ప్రాంతాన్ని ప్రత్యేక పర్యాటక కారిడార్‌గా గుర్తించి అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం సృష్టించిన అడ్డంకులు.. ముమ్మర ఏర్పాట్లు**

మంత్రి పర్యటన నేపథ్యంలో గురువారం అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఎస్పీ వహీదుద్దీన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా కురిసిన గాలివానకు సభా ప్రాంగణంలోని షామియానాలు కూలిపోయాయి. వర్షపు నీటికి ఏర్పాట్లు దెబ్బతిన్నా, అధికారులు వెను వెంటనే రంగంలోకి దిగి పనులను ముమ్మరం చేశారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి శుక్రవారం నాటి పర్యటనకు సర్వం సిద్ధం చేస్తున్నారు. మంత్రి జూపల్లి రాకతో ప్రాణహిత ప్రాజెక్టు భవితవ్యంపై స్పష్టత వస్తుందని జిల్లా ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు.

# పంట అవశేషాలను కాల్చడం భూమికి గొడ్డలి పెట్టు



- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా హెచ్చరిక
- వ్యర్థాలను తగులబెడితే భూసారం భస్మం నత్రజని, భాస్వరం వంటి పోషకాలు నశిస్తాయి..

**ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)**

వ్యవసాయంలో పంట కోతల అనంతరం మిగిలిపోయే పంట అవశేషాలను తగులబెట్టకుండా శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించి భూసారాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా రైతులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి ఆరోగ్యాన్ని సంరక్షించడం ప్రతి రైతు బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా భూమి సారవంతత కూడా క్రమంగా తగ్గిపోతుందని తెలిపారు. మంటలు అదుపుతప్పి సమీపంలోని పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా చెత్తను కాల్చడం వల్ల కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై వాయు కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. ఈ పొగ ప్రభావంతో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, పశువులు శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమిలోని సేంద్రీయ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి కీలక పోషకాలు నశిస్తాయని తెలిపారు. భూమిలో మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోవడంతో నేల చవిటిగా మారి పంట దిగుబడి తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. భూసారం తగ్గిపోవడంతో రైతులు రసాయన ఎరువులపై అధికంగా ఆధారపడాల్సి వస్తుందని, ఫలితంగా సాగు ఖర్చులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను తగులబెట్టకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. రోటవేటర్ సహాయంతో పంట అవశేషాలను భూమిలో కలియదున్నడం ద్వారా అవి సేంద్రీయ ఎరువుగా మారి భూమికి మేలు చేస్తాయని తెలిపారు. అలాగే పంట వ్యర్థాలతో కంపోస్ట్, వర్మీ కంపోస్ట్ తయారు చేసి తిరిగి పొలాల్లో వినియోగించుకోవాలని సూచించారు. వరి గడ్డి వంటి అవశేషాలను పశుగ్రాసంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. మల్చింగ్ పద్ధతిలో పంట అవశేషాలను వినియోగించడం ద్వారా భూమిలో తేమ నిల్వ ఉండి నీటి వినియోగం కూడా తగ్గుతుందని చెప్పారు. "పర్యావరణాన్ని కాపాడండి - రైతు భవిష్యత్తును రక్షించండి" అనే లక్ష్యంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు, లాభాలు సాధించాలని ఆకాంక్షించారు.

## గ్యాస్ సిలిండర్

# పేలి ఇల్లు దగ్ధం

### రూ.15 లక్షల ఆస్తి నష్టం

**మందమర్రి, మే 7(ప్రభాత సమాచారం)**

దైవదర్శనానికి కన్నెపల్లి మండలం ఎల్లారం పోషమ్మ ఆలయానికి బయలు దేరిన కాసేపటికే గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇల్లు పూర్తిగా కాలిపోయిన విషాద ఘటన మండలం లోని చిర్రకుంటలో గురువారం చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంద్ర వెంకటస్వామి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దైవ దర్శనానికి ఎల్లారం పోచమ్మ తల్లిని దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా గురు వారం ఉదయం బయలు దేరి వెళ్లారు. వెళ్లిన కాసేపటికే ఇంట్లో నుండి దట్టమైన పొగలు రావడంతో అప్రమత్తమైన చుట్టుపక్కల వారు బాధిత కుటుంబ సభ్యులకు, బెల్లంపల్లి ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించి, మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా అప్పటికే మంటలు దావానంలా వ్యాపించి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఇంటి పక్కనే ఉన్న ఇంటికి మంటలు అంటుకోగా చుట్టుపక్కల వారు మంటలు చెలరేగ కుండా నీళ్లుచల్లి మంటలను అదుపు చేశారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో విలువైన టీవీ, రిఫ్రిజిరేటర్, ఎలక్ట్రికల్ వస్తువులు, బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఇంట్లో దాచి ఉంచిన నగదు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు 15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు విలపించారు. కాగా ఘటనా స్థలాన్ని ఎంపీడీఓ రాజేశ్వర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాథోడ్ గణపతిలు సందర్శించి ప్రమాదం వివరాలు సేకరించారు. సిలిండర్ ప్రమాదంలో సర్వసం కోల్పోయిన వెంకటస్వామి కుటుంబానికి తక్షణ సాయంగా 5వేల రూపాయలు, నిత్యవసర సరుకులు ఎంపీడీవో రాజేశ్వర్,ఎంఆర్ఐ గణపతిలు అందజేశారు.



# కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు పక్కాగా పాటించాలి





- మంచిర్యాల అదనపు కలెక్టర్ వి. రాములు ఆదేశం
- జైపూర్, సోమనపల్లి, ఆస్నాద్ కేంద్రాల్లో ధాన్యం సేకరణ పరిశీలించిన అదనపు కలెక్టర్

**జైపూర్, మే 7(ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి దాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రం, చెన్నూర్ మండలం సోమనపల్లి, ఆస్నాద్ లలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో రైతులు నిబంధనల ప్రకారం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించి, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయా కేంద్రాలలో రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రైతులు తాలు, తప్ప, మట్టి గడ్డలు, తేమ లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలలో తాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జైపూర్ మండలం ఇందారం లోని జయలక్ష్మి రైస్ మిల్, భీమారం మండల కేంద్రంలోని సమత ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను సందర్శించి కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం చెన్నూర్, భీమారం లలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంటర్మీడియట్ గోదాములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వం లక్ష్యం
- మంత్రి గడ్డం వివేకానంద
- ధాన్యం సేకరణపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌తో కలిసి మంత్రి సమీక్ష
- సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్
- ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా నిఘా
- హమాలీల కొరత ఉన్నా ఆగని రవాణా
- జిల్లాలో రోజుకు 150 లారీల ధాన్యం తరలింపు
- రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటాం
- చెన్నూర్ మున్సిపల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

చెన్నూర్, మే 7(ప్రభాత సమాచారం)

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్ వినయ్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, రవాణా అంశాలలో వేసవి ఉష్ణోగ్రతతో పాటు ఇతర రాష్ట్రాలలో కొనసాగుతున్న ఎన్నికల సందర్భంగా హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితులలో సైతం జిల్లాలో రోజుకు 150 లారీల ధాన్యం తరలించడం జరుగుతుందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న ధాన్యం త్వరగా ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆలోచన మేరకు జిల్లాలో గోదాములను అద్దెకు తీసుకుని కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీల ద్వారా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు.. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో సంబంధిత నగదును జమ చేసే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలలో ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ కొనసాగించడం జరుగుతుందని, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 83 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా చేయడం జరిగిందని, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా గోదాములలో నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ తో కలిసి చెన్నూర్ మున్సిపల్ కౌన్సిలర్లతో పట్టణ అభివృద్ధి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ ఏర్పాటు పనులను వేగవంతం చేసి పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో చెన్నూర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన రహదారి విస్తరణ, మురుగు కాలువల వ్యవస్థ నిర్మాణంలో భాగంగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల కారణంగా ఎవరికి ఎలాంటి నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారి విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణాలు కేటాయించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, స్థలం కోల్పోయిన వారికి టి డి ఆర్ లో వెసులుబాటు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో అనవసర పుకార్లను నమ్మవద్దని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాణహిత పర్యటన వాయిదా

- ఢిల్లీ పర్యటనలు, బిజీ షెడ్యూల్ కారణంగా పర్యటన రద్దు
- మహారాష్ట్ర సీఎంతో చర్చల అనంతరం మళ్లీ పర్యటనకు అవకాశం
- ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్‌కు లక్ష ఎకరాల సాగునీరు
- త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తామన్న ఎమ్మెల్సీ దండే విఠల్

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది. గురువారం నాడు సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల ఈ పర్యటన రద్దయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ముఖ్యమంత్రి పర్యటన రద్దు కావడానికి ప్రధానంగా రెండు కారణాలు వినిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉండటం, ఇతర ముఖ్యమైన పాలనాపరమైన కార్యక్రమాలు ఉండటంతో ఈ టూర్ వాయిదా పడింది. అంతేకాకుండా, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపాల్సి ఉంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ అయిన తర్వాతే క్షేత్రస్థాయికి వెళ్లడం బాగుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భేటీ తర్వాత రేవంత్ రెడ్డి పూర్తి స్పష్టతతో సిర్పూర్ పర్యటనకు వెళ్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తూ, తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇక్కడ గ్రావిటీ ద్వారా ప్రాజెక్టు నిర్మిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఉంటుందని నిపుణుల అభిప్రాయం. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. కేవలం గ్రావిటీ ద్వారానే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు అదనంగా 100 టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉందని ఇంజనీర్లు చెబుతున్నారు. సీఎం పర్యటన వాయిదా పడటంపై శాసనమండలి సభ్యుడు, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దండే విట్టల్ స్పందించారు. పర్యటన కేవలం వాయిదా మాత్రమే పడిందని, రద్దు కాలేదని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ఈ ప్రాజెక్టుపై శ్రద్ధ ఉంది. త్వరలోనే మహారాష్ట్ర సీఎంతో చర్చలు ముగించుకుని, కొత్త తేదీని ఖరారు చేస్తాం. అప్పుడు భారీ బహిరంగ సభతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని వెల్లడించారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY




# నకిలీ విత్తనాల గుట్టురట్టు

- టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు ■ 150 ప్యాకెట్ల స్వాధీనం
- గుజరాత్ నుంచి నకిలీ విత్తనాల దిగుమతి..
- 'మౌళి 5౦' పేరుతో అమాయక రైతులను ముంచుతున్న ముఠా.
- నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ తప్పదు పోలీసుల హెచ్చరిక.

ఆదిలాబాద్, మే 7(ప్రభాత సమాచారం)

సాగు సీజన్ ప్రారంభం కావడానికి ముందే జిల్లాలో నకిలీ విత్తన విక్రేతలు కోరలు చాస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమంగా కాసులు సంపాదించాలని చూస్తున్న నకిలీ విత్తన ముఠా ఆట కట్టించారు. అదిలాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు. పట్టణంలోని రద్దీగా ఉండే ఎన్టీఆర్ చౌరస్తా ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ నకిలీ పత్తి విత్తనాల దందాను పోలీసులు బట్టబయలు చేశారు. అదిలాబాద్ వన్ టౌన్ సీఐ బి. సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద అక్రమంగా విత్తనాలు విక్రయిస్తున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ బృందం మెరుపు దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో ఇచ్చోడ మండలం ముక్రా (బి) గ్రామానికి చెందిన అడావు రవికాంత్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. అతని వద్ద తనిఖీ చేయగా, ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేని "మౌళి 5౦" అనే బ్రాండ్ పేరుతో ఉన్న 150 పత్తి విత్తనాల ప్యాకెట్లు లభించాయి. పోలీసుల ప్రాథమిక విచారణలో నిందితుడు విస్తుపోయే నిజాలు వెల్లడించాడు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన రజత్ పటేల్ అనే వ్యక్తి నుంచి ఈ విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, జిల్లాలోని అమాయక రైతులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు రవికాంత్ ఒప్పుకున్నాడు. ఈ విత్తనాలకు సంబంధించి ఎటువంటి రశీదులు (బిల్లులు) లేకపోవడంతో పాటు, వీటి నాణ్యతపై కూడా ఎలాంటి గ్యారంటీ లేదని అధికారులు తేల్చారు. పట్టుబడిన స్టాక్‌ను సీజ్ చేసి, రవికాంత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సునీల్ కుమార్ సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే తీసుకోవాలి. ప్రతి కొనుగోలుకు పక్కా బిల్లు అడగాలని, బిల్లు లేని విత్తనాలను వాడితే నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అనుమతి లేని విత్తనాలు (బిజి-3 వంటివి) విక్రయించినా, నిల్వ చేసినా అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా పిడి యాక్ట్ (గ్రాణ చాష్) కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా నిఘా పెంచాయని, ఎక్కడైనా అనుమానాస్పదంగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.